# కథ అడ్డం తిరిగింది




"అబ్బబ్బ ఆ రోమియోతో వేగలేకపోతున్నానే సీతా!"

"ఏ రోమియో?" అర్థంగాక అడిగింది సీత.

"వాడేనే. మన కాలేజీలో ఎత్తుపళ్ల మన్మధ రావు లేడూ, వాడి గొడవ ఎక్కువౌతోందనుకో. రోజూ వెంట పడతాడు. తిక్క తిక్కగా వాగుతాడు. బాడీగార్డులా ఇంటివరకు వస్తాడు. వాడి కోతి రూపం చూసి లవ్ చేస్తాననుకున్నాడు కాబోలు!" ఉష కసిగా అంది.

కాస్సేపు ఆగి అంది సీత నెమ్మదిగా—"నువ్వు ఏమనుకోనంటే చిన్న మాట."

"ఏవిటీ?" ఉష అంది.

"కాస్త నీ వేషధారణలో మార్పు రావాలే. వళ్లంతా కన్పించేలా బట్టలు, నువ్వూనూ. మరీ బట్టల్లో అంత పొదుపు పాటిస్తే ఎలా?"

"చాల్లే చెప్పొచ్చావ్! నా యిష్టం వచ్చినట్లు డ్రెస్ చేసుకుంటాను. మధ్య నీ బోడి కామెంటేమిటీ?" కోపంగా అంది ఉష.

"మరి నాతో చెప్పకైతే. వాడి బాధలు సహించు!" విసురుగా తల తిప్పింది సీత.

"అదిగాదే సీతా! నాకీ డ్రెస్ అంటే ఎంత యిష్టమో నీకు తెల్సుగా. మధ్య వాడి గొడవేంటి చెప్పు. నా యిష్టం వచ్చినట్లు అలంకరించుకోటానికి కూడా నాకు హక్కు లేదా!" కాస్త బాధగా అంది.

"హక్కుల విషయం యిక్కడ కొశ్చన్ కాదు. నలుగురిలోకి వచ్చేటప్పుడు ఇక్కడ నీ యిష్టం అంటే కుదరదు. యిలాటి వెర్రిమొర్రి వేషాలేస్తే కుర్రకారు సహించి, తమ దారిని తాము పోరు. చేతులారా మనమే వాటికి దోహదం చేసిన వాళ్ళం అవుతాం!

"కాదులే, వాడి తిక్క నేను కుదురుస్తాను. నువు అలాగే చూస్తూండు. మళ్ళీ నా వైపు తిరిగి చూడకుండా చేస్తాను!"

"ఏవిటి చేస్తావ్?" కాస్త కుతూహలంగా అడిగింది సీత.

"ఇప్పుడు చెప్పను. చెప్తే మజా పోతుంది."

"నాకు కూడా చెప్పవా? ఒసేవ్, నేను నీ డియరెస్టు ఫ్రెండ్‌నే!" బ్రతిమిలాడింది సీత.

చెప్పింది ఉష.

"బాగుంది నీ అయిడియా!" అభినందించింది సీత.

*

"మేడమ్!"

ఉలిక్కిపడి తిరిగింది ఉష. ఎదురుగా ఎత్తుపళ్ళ మన్మధరావు.

"ఇంటికేనా?" యికిలించాడు.

"ఆఁ" అంది ఉష బుక్స్ గుండెల కానించుకుంటూ.

"ఈ రోజు మీ డ్రెస్ వెరీ వండ్రఫుల్.... మార్వలెస్!"

"థాంక్స్!" నవ్వింది ఉష.

"అబ్బ ఈ రోజు చాల చలిగా వుంది మాడమ్" వణుకుతున్నట్టు పోజు పెట్టి అన్నాడు మన్మధరావు ఓరగా ఉషను చూస్తూ.

"అలాగా! రేపటి నుంచీ తప్పకుండా స్వెట్టర్ వేసుకురండి. చలి చాలవరకు తగ్గుతుంది. అయినా చలికాలం కదా. దేని సహజత్వం దానిది!"

"అవునుసుమీ!" వొప్పుకున్నాడు.

"అవునూ....యిలా రోజూ నా వెనకాల పడతారెందుకూ? మరేం పని లేదా?"

"ఇది మాత్రం పని కాదా!" కళ్ళు చికిలించాడు.

"మీరన్నదీ పాయింటే" నవ్వింది ఉష.

"అవునూ, ఈ రోజు నన్ను చూసి మండి పడకుండా చాల చక్కగా మాట్లాడుతున్నారే!"

"అబ్బే ఛీ! ఎందుకు మండిపడతానూ, నాలో చాల మార్పు వచ్చింది సుమండీ!"

మన్మధరావు ఉబ్బి తబ్బిబ్బైపోయాడు.

"మీతో ఓ మాట చెప్పాలి!" తల వంచుకుని అంది ఉష గోళ్ళు కొరుకుతూ.

"ఏవిటదీ!" సైకిల్ మీద నుండి ముందుకు వంగుతూ అన్నాడు.

"అబ్బే ఏం లేదు. రోజూ యిలా మీరు నా వెంట పడకుండా మీకో చిట్కా చెప్తాను. యిదెంతో శ్రమ గదా మీకు. అందుకని నన్ను పెళ్ళిచేసుకోండి. ఏవంటారు?" ఉష సిగ్గుపడుతూ అంది.

మన్మధరావు క్షణకాలం స్థంభీభూతుడయ్యాడు.

అతని ముఖకవళికలు గమనిస్తూ మనసులోనే నవ్వుకుని 'అమ్మయ్య నీ తిక్క కుదిరిందా!' అనుకుంది ఉష.

మన్మధరావు తొందరగానే తేరుకుని, చిరునవ్వు నవ్వుతూ "ఏవిటి? నేను అంత అదృష్టవంతుడినా ఉషా! ఆల్‌రైట్ మీ కోరిక నేనెందుకు కాదనాలి? అంతగా ఆశగా అడుగుతుంటే!" అంటూ గబుక్కున జేబులోంచి ఏదో లాగాడు. "చూడండి వీటిని మంగళసూత్రా లంటారు. వీటిని అస్తమానం జేబులోనే వుంచుకుంటాను. ఎందుకంటారా! మీ లాంటి ఏ ఆడపిల్లైనా తక్కున పెళ్ళిచేసుకోమన్నదనుకోండి! రెడిగా దగ్గరుంటాయని ఈ మధ్యనే కొన్నాను. తొందర్లోనే వీటి అవసరం వచ్చింది. ఆ కన్పిస్తున్న గుడికి పోదామా!" మంగళసూత్రాల్ని వూపుతూ అన్నాడు మన్మధరావు.

ఉష తేరుకోటానికి రెండు నిముషాలు పట్టింది. అంత చలికాలంలోనూ వంటికి పట్టిన చెమట కర్ఛీఫ్‌తో తుడుచుకుంటూ, 'డామిట్! కథ అడ్డం తిరిగిందే!' అనుకుని పరుగు లాంటి నడకతో బయలుదేరింది పూర్ ఉష.

—పి. శ్యామల

చిట్టి కథ